క్లుప్తంగా

వక్తృత్వ పోటీల్లో ప్రతిభ

వైవీయూ : రాయచోటి పట్టణంలో ఈనెల 18వ తేదీ నిర్వహించిన జిల్లాస్థాయి యువ ఉత్సవ్‌లో వక్తృత్వ పోటీల్లో కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్. సానియా ప్రథమ బహుమతి సాధించింది. 'పంచ్ ప్రాన్ ఆఫ్ అమృత్‌కాల్' అన్న అంశంపై నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలిచి రూ.5వేలు నగదు బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీం బాషా అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. జి. విజయలక్ష్మి, డా. పి. శచీదేవి పాల్గొన్నారు.

హజ్ యాత్రతో జీవితం ధన్యం

కడప కార్పొరేషన్ : హజ్‌యాత్రతో జీవితం ధన్యమవుతుందని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పి. ఖాదర్ బాషా అన్నారు. బుధవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో హజ్ యాత్ర విజయవంతంగా పూర్తి చేసుకొని వచ్చిన హాజీలు రఫీఖాన్, మస్తాన్‌లను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం హజ్ యాత్ర చేసేవారికి మంచి సదుపాయాలు కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోరుగోల్, అబ్దుల్లా, అరీఫ్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఈ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫోటో, వీడియోగ్రఫీ 30 రోజులు, సెల్‌ఫోన్ రిపేర్ సర్వీసింగ్ 30 రోజులు, సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్ సర్వీసింగ్‌కు 13 రోజులు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈనెల 26వ తేది నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫ్యాప్టో జిల్లా ట్రెజరర్‌గా వెంకటసుబ్బయ్య



కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) కడప జిల్లా ట్రెజరర్‌గా ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య ఎన్నికయ్యారు. కడపలోని యూటీఎఫ్ భవన్‌లో ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో వెంకటసుబ్బయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫ్యాప్టో జిల్లా ట్రెజరర్‌గా ఎన్నికైన వెంకటసుబ్బయ్య సుదీర్ఘ కాలంగా ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేస్తున్నారు. ఎస్టీయూలో సుదీర్ఘకాలంగా వివిధ హోదాల్లో బాధ్యతలను నిర్వహించారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలో ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందించి సన్మానించనున్నట్లు మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ ముట్టిపల్లి మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత కార్యక్రమాన్ని ఈనెల 23న సాయంత్రం 5 గంటలకు కడప అపూర్వ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 430, ఆపైన మార్కులు, బైపీసీ గ్రూపులో 400 ఆపైన మార్కులు, ఎంఈసీ గ్రూపులో 470 ఆపైన మార్కులు, సీఈసీ గ్రూపులో 450 ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించనున్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే విద్యార్థులు వారి గుర్తింపుకార్డు ఇంటర్ పరీక్షల్లో సాధించిన మార్కుల జాబితా తీసుకుని రావాలని తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు ఉచిత రిజిస్ట్రేషన్‌కు 92487 22218, 63032 93445 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

'ఇండియా' ఏర్పాటు శుభ పరిణామం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దేశంలో ఎన్డీయే కూటమికి వ్యతిరేకంగా 26 ప్రతిపక్ష పార్టీలు కలిపి ఏర్పాటు చేసుకున్న భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి (ఇండియా) దేశాభివృద్ధికి ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని ఎస్‌ఎఫ్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల్లేష్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్డీయే ప్రభుత్వంతో రైతులు, సామాన్య ప్రజలు, వ్యాపారులు విసిగి పోయారని తెలిపారు. దేశ సంపదను అంబానీ, అదానీలకు కట్టబెడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ఏకాదశిరెడ్డి, వంశీ యాదవ్, జీవన్ కుమార్ పాల్గొన్నారు

పుస్తకాలు వితరణ

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రంథాలయానికి రాయల్ రసీద్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఇంటాక్ సీనియర్ సభ్యులు రాయల్ కరీముల్లా తమ వద్ద ఇంటాక్ వారసత్వ సంపదకు సంబంధించిన విరాసత్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యరావు, లైబ్రేరియన్ శివరంగారెడ్డిలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.2.61కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

రూ.15 లక్షలకు ఎగ్జిబిషన్ టెండర్ ఖరారు



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో రూ.2.61కోట్ల అభివృద్ధి పనులకు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. బుధవారం సాయంత్రం మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 38వ డివిజన్ అగాడిలో కల్వర్టు నిర్మాణానికి రూ.12.50 లక్షలు, 28వ డివిజన్‌లోని బీకేఎం వీధిలో రోడ్డు నిర్మాణం కోసం రూ.17.50 లక్షలు, అదే డివిజన్‌లోని సాధు చెంగన్న వీధిలో రోడ్డు, డ్రైన్ నిర్మాణం కోసం రూ.12.50 లక్షలు, 30వ డివిజన్‌లో గ్రూప్ థియేటర్స్ వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.11.80 లక్షలు, 14వ డివిజన్‌లోని ప్రకాష్‌నగర్‌లో బీటీ రోడ్డు వేయుటకు రూ.18.90 లక్షలు, 16వ డివిజన్ మామిళ్లపల్లెలో అన్నపూర్ణమ్మ ఆలయం నుంచి రామచంద్రయ్య కాలనీ వరకూ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.16.70 లక్షలు, అదే డివిజన్‌లో సుబ్బన్నగారిపల్లె నుంచి బాబా నగర్ వరకూ రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు, మెప్మా టౌన్ లెవెల్ ఫెడరేషన్ భవన నిర్మాణానికి రూ.70 లక్షలు, కేసీ కెనాల్ రోడ్డు విస్తరణ పనుల్లో కొత్త ఆర్‌సీసీ కాలువ నిర్మాణానికి రూ.21.10 లక్షలతో రూపొందించిన అంచనాలను ఆమోదించారు. కడప నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన 10 టాయిలెట్లలో రెండు టాయిలెట్లను పే అండ్ యూజ్ కింద నిర్వహణ చేసేందుకు, మిగతా 8 టాయిలెట్లను నెలకు రూ.21వేలతో నిర్వహణ చేయడానికి సులభ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ సర్వీసెస్ వారికి అప్పగించేందుకు అంగీకరించారు. మున్సిపల్ మైదానంలో 60 రోజులపాటు ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు ఎస్ ఎస్ హాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ వారు రూ.15లక్షలతో వేసిన టెండర్‌ను ఆమోదించారు. కడప కార్పొరేషన్ పరిధిలో పాత మున్సిపల్ కార్యాలయం పక్కన నాగరాజుపేటలో నిర్మించిన పెట్రోలియం రిటైల్ అవుట్‌లెట్ నిర్వహణకు రూ.50లక్షలు జనరల్ ఫండ్ నుంచి చెల్లించాలని తీర్మాణించారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రవీణ్ చంద్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎం. సుబ్బారెడ్డి, శిరీష, మేసా ప్రమీలరాణి, షఫీ, హేమలత పాల్గొన్నారు.

అందుబాటులోకి యూత్ స్టడీ హాల్



స్టడీహాల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

వైవీయూ : కడప నగరం బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్‌లో 'మహాత్మాగాంధీ యూత్ స్టడీ హాల్' అందుబాటులోకి వచ్చింది. కడప నగరపాలక సంస్థ, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్టడీ హాల్‌ను కడప నగరపాలక సంస్థ కమిషనర్ జి.సూర్యసాయిప్రవీణ్‌చంద్ ప్రారంభించారు. బుధవారం నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కమిషనర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి హాల్‌ను యువతకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూత్ స్టడీహాల్‌ను విద్యార్థులు, పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా క్యాబిన్‌లు ఏర్పాటు, ఫ్రీ వైఫై, నీటిసౌకర్యం, వివిధ రకాల పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ కె.మణికంఠ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఉద్యోగ నోటిఫికేషన్‌లు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో నిరుద్యోగులకు ఉపయుక్తంగా ఉండేందుకు స్టడీహాల్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. నామమాత్రపు ఫీజుతో విద్యార్థులు, పోటీపరీక్షల అభ్యర్థులు వినియోగించుకోవచ్చని సూచించారు. అనంతరం యూత్ హాస్టల్ ఆవరణంలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ శ్రీనివాసులరెడ్డి, యువత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి శిక్షణ విజయవంతం చేయాలి

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలో జులై 22, 23 తేదీలలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని రాష్ట్ర మాజీ పీడీఎస్‌యూ నాయకులు, వైద్యులు రామచంద్రారెడ్డి కోరారు. బుధవారం కడప పీడీఎస్‌యూ కార్యాలయంలో అందుకు సంబంధించి కరపత్రాలను పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునైద్‌లతోపాటు పలువురు నాయకులతో కలిసి విడుదల చేశారు. తరగతులను కడప నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వరూప్‌తేజ్, శ్రీనాథ్, రఘురాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

దూదేకులకు షాదీతోఫా వర్తింపజేయడం అభినందనీయం

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూర్‌బాషా, దూదేకులకు వైఎస్సార్ షాదీతోఫా వర్తింపజేయడం అభినందనీయమని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఏపీ నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే పీర్ మహమ్మద్, హాఫీజ్ రెహమాన్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డా. మస్తానమ్మ తెలిపారు. బుధవారం విజయవాడలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డిని వారు కలిసి ధన్యవాదాలు తెలిపి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షుడు రాయల్ బాబు, గుంటూరు నగర అధ్యక్షుడు ఆదం షఫీ, మీడియా కో ఆర్డినేటర్ నాగూర్ వలీ పాల్గొన్నారు.

ప్రతిరోజూ తాగునీరందించేందుకు కృషి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో ప్రజలకు ప్రతిరోజూ తాగునీరందించేందుకు ఇంజినీరింగ్ అధికారులు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ తెలిపారు. బుధవారం ఫిట్టర్లు, వీధి దీపాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. లింగంపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న కలెక్షన్ వెల్ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాత గండి వాటర్ వర్క్స్‌లో పంప్‌హౌస్‌ను పరిశీలించారు. బోర్‌వెల్స్, ట్యాంక్స్ సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. వాటి నుంచి ఏఏ ప్రాంతాలకు నీటి సరఫరా అవుతుందో తెలుసుకున్నారు. పాత మున్సిపల్ ఆఫీసులో ఉండే ట్యాంకు నందు క్లోరినేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాసాపేటలో ఏర్పాటు చేసిన పైపుల్లో సమస్యలను పరిష్కరించాలని, మరియాపురం ప్రాంతానికి సంబంధించి వాటర్ కనెక్షన్లు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎస్ఈ రత్నాల రాజు, ఈఈ నారాయణస్వామి, డీఈలు కరిముల్లాఖాన్, రాజేష్, అబిద్ హుస్సేన్, ఏఈ మణిగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం, యూపీ స్కూల్ తనిఖీ

కడప నగరంలోని ఆర్‌కే నగర్ అంగన్‌వాడీ కేంద్రం, మండల ప్రజాపరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు పట్టికలను పరిశీలించి, పిల్లలు, గర్భిణీల కోసం ఏర్పాటు చేసిన భోజనాన్ని పరిశీలించారు. పిల్లలు ఎత్తుకు తగిన బరువు ఉన్నారో లేదో చూశారు. ఎంపీపీ స్కూల్‌లో టాయిలెట్ల నిర్మాణంలో ఉన్న లోపాలను సరిచేయాలన్నారు. పాఠశాల ముందున్న కాలువపై స్లాబ్ వేయించాలన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.

కార్మికులపై పక్షపాత ధోరణి తగదు

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వం పక్షపాత ధోరణి ప్రదర్శించడం తగదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్. రవి అన్నారు. బుధవారం నెహ్రూపార్కు సచివాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల హెల్త్ అలవెన్స్‌ను జీతంలో కలపకుండా విడిగా ఇచ్చారని, అది కూడా కేవలం పారిశుద్ధ్య విభాగ కార్మికులకు మాత్రమే ఇచ్చారని, ఇది కేవలం కంటితుడుపు చర్య అన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 20, 21 తేదీలలో నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాల్లో మున్సిపల్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

శ్రమించే తత్వంతో ఉన్నతశిఖరాలు



మాట్లాడుతున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : క్రమశిక్షణ, నిరంతరం శ్రమించే తత్వం విద్యార్థులను అత్యున్నత స్థానానికి చేర్చుతుందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం వైవీయూలోని గురుకులం భవనాల్లో కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ హాజరై మాట్లాడారు. విశ్వవిద్యాలయంలోకి ప్రవేశించే విద్యార్థులు ఒక ఉన్నతమైన ఆశయంతో ఇక్కడ ప్రవేశం పొంది ఉంటారని, ఆ లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. క్రమశిక్షణతో మెలగాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. ఇక్కడ లభించే వనరులను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు కోర్సు పూర్తి చేసుకున్న వెంటనే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌కి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, అందులో జ్ఞానాన్ని పొందడానికి గురువుల సహకారం తీసుకుని నిష్ణాతులు కావాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సౌకర్యాలతో పాటు ఎలా మసులుకోవాలో వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎంబీఏ కోర్సులు ఏఐసీటీయూ నిబంధనల మేరకే విశ్వవిద్యాలయంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా. బి. రెడ్డయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలను తనిఖీ చేయాలి

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలను పాటించని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం కడప ఆర్‌జేడీ కార్యాలయ ఏడీ అరుణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయకుండా ఇష్టానుసారంగా ఫీజులు పెంచుకుంటూ పోతున్నాయన్నారు. అధికారులు స్పందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు వలి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిక్షణ సక్రమంగా ఇవ్వాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డా. సురేఖ

కడప కార్పొరేషన్ : వైద్య విద్యార్థులు, వైద్య పట్టభద్రులు, ఏఎన్‌ఎంలు, ఆశాలకు సమగ్ర ప్రాథమిక ఆరోగ్య శిక్షణ సక్రమంగా ఇవ్వాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. సురేఖ అన్నారు. బుధవారం ప్రభుత్వ వైద్యశాలకు సంబంధించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ పట్టణ ఆరోగ్య శిక్షణ కేంద్రాన్ని ప్రెస్‌క్లబ్ పక్కనున్న నాగరాజుపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలోకి మార్చారు. ఇదివరకు ఈ శిక్షణ కేంద్రం అక్కాయపల్లెలో ఉండేది.

స్థలాభావం కారణంగా ప్రస్తుతం దీన్ని నాగరాజుపేట యూహెచ్‌సీకి మార్చారు. దీన్ని ప్రారంభోత్సవం చేసిన డా. సురేఖ మాట్లాడుతూ వైద్య విద్య అభ్యసిస్తున్న ప్రతి ఒక్కరూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డా. ఖాదర్‌వలీ, సామాజిక వైద్య శాస్త్రం విభాగం అధ్యక్షులు డా. గోపీక్రిష్ణ, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. వరలక్ష్మి, అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డా. శ్రీనివాస్ నాయక్, వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. ఉమామహేశ్వరరావు, జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారి డా. శశిభూషణ్‌రెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల డీడీ డా. శంకర్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రెడ్డి, డా.సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు ఉంటారని దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కడప మండల ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్ పేర్కొన్నారు. కడప వక్కలపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ స్కూల్ హెడ్ టీచర్, ఎస్టీయూ జిల్లా కన్వీనర్ నజీబుల్లా విద్యార్థుల కోసం పలకలు, పెన్నులు తెచ్చారు. సంబంధిత కార్యక్రమానికి ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పెన్నులు, పలకలను అందచేసి వారి చేత అక్షరాభ్యాసాన్ని చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను ప్రతి రోజు తల్లిదండ్రులు బడికి పంపి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నగరశాఖ అధ్యక్షుడు సాదిక్‌అలీ, ఎస్‌ఎంసీ చైర్మన్ సల్మ పాల్గొన్నారు.

గండి ఉత్సవాలపై సమీక్ష

చక్రాయపేట : శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా గండికి వచ్చే ప్రతి భక్తుడికి స్వామి దర్శనం కలిగేలా చూడాలని పులివెందుల ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం గండి క్షేత్రంలోని సహాయ కమిషనర్ కార్యాలయంలో ఉత్సవాల నిర్వహణపై సమన్వయ కమిటీ భేటీ అయింది. ఆలయ పాలక మండలి సభ్యులతో పాటు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, అర్చకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు భేటీలో పాల్గొన్నారు. తిరుమత తిరుపతి దేవస్థానం సహకారంతో భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక డార్మెటరీ, మొబైల్ మరుగు దొడ్లను ఉచితంగా ఏర్పాటు చేయించడమే కాకుండా వంద మంది వరకు పారిశుద్ధ్య కార్మికులను పంపించేలా సంబంధిత అధికారులతో మాట్లాడాలని పలువురు ఓఎస్డీకి వివరించారు. భక్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయభాస్కర్‌తో చర్చించారు. అలాగే శాంతి భద్రతల పరంగా తీసుకుంటున్న జాగ్రత్తలను ఆర్కేవ్యాలీ ఎస్ఐ రంగారావు వివరించారు. వైద్యశిబిరం ఏర్పాటుపై వైద్యాధికారి శ్రీవాణికి సూచించారు. మరిన్ని అంశాలపై కూడా వారు చర్చించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఏడీఈలు శ్రీకాంత్, రమేష్‌రెడ్డి, ఫైర్ ఆఫీసర్ శివప్రసాదరెడ్డి, తహసీల్దారు రాజసింహనరేంద్ర, ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్, ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలా చార్యులు, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, మండల సమన్వయ కర్త ఓబుళరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కాపు కన్వీనర్‌గా సురేష్

కమలాపురం : నియోజకవర్గ కాపు కన్వీనర్‌గా కమలాపురం పట్టణానికి చెందిన జొన్నలగడ్డ సురేష్‌ను నియమించినట్లు కాపు రాష్ట్ర జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు, కడప కాపు జేఏసీ కన్వీనర్ బండి ప్రతాప్‌లు ఉత్తర్వులు జారీ చేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా నిర్వర్తిస్తానని సురేష్ అన్నారు.

సేవకు సలాం



బాధ్యతగా విధులు..

ఆటో తోలుకుంటూ జీవనం సాగించే కార్మికుడికి వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అందించే పథకాలను వలంటీర్ దరి చేర్చాడు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల లబ్ధి చేకూరింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాలంటీర్ వ్యవస్థ వల్ల ఇంటి ముంగిటకే పథకాలు అందుతున్నాయి. ఇందులో భాగంగానే కడప 18వ వార్డులో నివాసం ఉంటున్న మేకల ప్రతాప్‌కు అన్ని రకాల సమస్యలను పరిష్కరించడంతోపాటు ఆయనకు సంబంధించిన రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, పిల్లోడికి అమ్మ ఒడి, మేకల ప్రతాప్ అవ్వకు పింఛన్.. ఇలా అన్ని పథకాలు వలంటీర్ రామలోకమ్ అధికారుల ద్వారా సమకూర్చారు. దీంతో ఆ కుటుంబం ఎంతో సంతోషంగా ఉంది.



వలంటీర్ నుంచి ఆరోగ్యశ్రీ కార్డు అందుకుంటున్న మేకల ప్రతాప్

– కడప ఎడ్యుకేషన్

వలంటీర్ సేవలు మరచిపోలేను



మా వలంటీర్ పూజారి రామలోకమ్ నాయక్ సహకారంతో నా ఇంటి ముంగిటకే పథకాలు అందుతున్నాయి. నాకు రేషన్‌కార్డు వచ్చింది. ఆరోగ్యశ్రీ కార్డు వచ్చింది. మా అబ్బాయికి అమ్మ ఒడి వచ్చింది. అన్ని రకాలుగా లబ్ధి చేకూరింది. ఈ ప్రభుత్వం, వాలంటీర్ సేవలు మరచిపోలేను.

- మేకల ప్రతాప్, ఆటో డ్రైవర్, తారకరామనగర్. కడప

నిజాయితీగా సేవలు..



చెంచు రెడ్డికి పింఛను అందజేస్తున్న వలంటీర్ బొల్లు ప్రత్యూష

ఆమె పేరు బొల్లు ప్రత్యూష. కడప నగర పాలక సంస్థ పరిధిలోని 45వ డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో వలంటీర్‌గా సేవలను అందిస్తోంది. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తనకు కేటాయించిన 50 ఇండ్లకు అందిస్తోంది. కరోనా సమయంలో ధైర్యంగా బయటకు వచ్చి తన పరిధిలోని లబ్ధిదారులకు సేవలను అందించింది. వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేయడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన సేవలను అందించింది. నాలుగు సంవత్సరాల కాలంలో ప్రజల ఆదరణ పొందుతూ విధులు నిర్వర్తిస్తోంది.

– కడప వైఎస్‌ఆర్ సర్కిల్

ఆసుపత్రికి వచ్చి పింఛన్ ఇచ్చింది..



నాకు ప్రభుత్వం నుంచి ప్రతి నెలా వస్తున్న ఫింఛను వలంటీర్ బొల్లు ప్రత్యూష ఇంటి వద్దకు వచ్చి అందిస్తోంది. నాకు ఆరోగ్యం బాగాలేక నగరంలోని సన్‌రైజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉంటే అక్కడికి వచ్చి నా ఆరోగ్య యోగ క్షేమాలు తెలుసుకొని పింఛను అందజేసింది. చదువురాని మేము కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడేవాళ్లం. అలాంటిది మాకు ఇంటి వద్దకు వచ్చి కావాల్సిన ధృవ పత్రాలను అందజేస్తోంది.

- ఎస్. చెంచు రెడ్డి, బాలాజీనగర్, 45వ డివిజన్

దోమల నిర్మూలనకు చర్యలు



చలమారెడ్డిపల్లెలో డెంగీ నివారణ మాసోత్సవంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

కడప రూరల్ : సమిష్టిగా దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సరస్వతి అన్నారు. బుధవారం స్థానిక చలమారెడ్డిపల్లెలో డెంగీ నివారణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆ ప్రాంత పరిసరాల్లో పర్యటించారు. దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, డెంగీ తదితర వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నిర్మూలించవచ్చన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ త్యాగరాజు, ఏఎంఓ వెంకట రెడ్డి, ఎస్ఈఓ లక్షుమయ్య, ఎంపీహెచ్ఈఓ నిత్య పూజయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



తప్పెట్లలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తప్పెట్ల గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల గురించి చెప్పగానే ముగ్గురు ముఖ్యమంత్రులు గుర్తుకు వస్తారని.. వారిలో ఒకరు ఎన్టీఆర్ కాగా మరొకరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మూడో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. వీరు ముగ్గురు ప్రజా సంక్షేమ పథకాలతో చరిత్రలో నిలిచిపోయారన్నారు. 15 సంవత్సరాలు పాలన సాగించిన చంద్రబాబు చరిత్ర హీనులుగా నిలిచారని విమర్శించారు. అనంతరం ప్రజలకు వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు రామచంద్రారెడ్డి, సర్పంచ్ పుత్తా శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, రవీంద్రారెడ్డి, ముకుందారెడ్డి, బాల మైసూరారెడ్డి, ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష వినియోగించుకోవాలి

పెండ్లిమర్రి : జగనన్న సురక్ష పథకం ప్రజలకు వరం లాంటిందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీ ఎస్‌ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి తెలిపారు. పెండ్లిమర్రి గ్రామ సచివాలయంలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. 11 రకాల సర్టిఫికెట్లు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎలాంటి రుసుము లేకుండా వలంటీర్లు ఇంటి వద్దకే తీసుకుని వస్తారన్నారు. అలాగే పెండ్లిమర్రిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల స్పెషలాఫీసర్ ప్రభాకర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, ఎంపీటీసీ కృష్ణయ్య, మాజీ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



మాట్లాడుతున్న ఆర్‌ఓ చంద్రమోహన్

కమలాపురం : అర్హత ఉన్న యువతీ యువకులందరికీ ఓటు హక్కు కల్పించాలని రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రమోహన్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ సభా భవనంలో మండలంలోని బీఎల్‌ఓలకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండి స్థానికంగా నివాసం ఉన్న యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. పెళ్లి అయిన వారివి, మరణించిన వారి ఓట్లు తొలగించేందుకు సిఫార్సు చేయాలన్నారు. ముఖ్యంగా ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితా పరిశీలించి తప్పులుంటే కరెక్షన్ చేయాలన్నారు. ఆధార్ అనుసంధానం, ఎపిక్ కార్డు నెంబర్ తదితర వివరాలను పరిశీలించాలన్నారు. ఎపిక్ కార్డులో ఫొటో సరిగా లేక పోతే వారి వద్ద నుంచి పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని స్కాన్ చేయాలన్నారు. కొత్త ఓటు నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులకు తగిన ఫారాలు వినియోగించాలన్నారు. ఓటరు జాబితాలో తప్పొప్పులుంటే సరి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, డీటీలు నరేంద్ర, అహల్య, శ్రీకాంత్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.